MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com

SRI SWAMI ASSOCIATES
ARCHITECTS•ENGINEERS•SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissions, LRS, BRS, Tax Assesments

వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.

GHMC, HMDA, DTCP, TS-bpass - Layout's, Building Permissions

H.No. 11-5-565, Bhagya Laxmi Towers,
Opp: GHMC Circle Office,
Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595

Happy 75th Independence Day

# క్రైమ్ మిర్రర్

Voice of Anti Corruption

## తెలంగాణ జిల్లాలు

సోమవారం 22-06-2026 | పబ్లిషింగ్ సెంటర్ : హైదరాబాద్

## బిల్డర్ల గుప్పిట్లో ఇంద్రేశం..!

# అచేతన స్థితిలో అధికారులు..?

- అక్రమ నిర్మాణాల జోరుకు అడ్డుకట్ట ఎక్కడ..?
- ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి -- ప్రజల్లో తీవ్ర ఆగ్రహం
- ఇంద్రేశంపై బిల్డర్ల పట్టు.. అధికారుల చేతులెత్తివేత..!
- అనుమతులు లేవు.. అంతస్తులు మాత్రం పెరుగుతూనే ఉన్నాయి..!
- కలెక్టర్‌కు ఫిర్యాదులు.. బిల్డర్లకు మాత్రం భయం లేదు..!
- 25 మందికి పైగా బిల్డర్ల రాజ్యం.. మున్సిపాలిటీ మౌనం..!
- రాజకీయ అండతోనే అక్రమాల జోరు..?
- చూస్తూ ఊరుకుంటున్నారా.. లేక కాపాడుతున్నారా..?
- టాక్స్ ఎగ్గొట్టి కోట్ల వ్యాపారం..! నష్టాల్లో మున్సిపాలిటీ..!
- నోటీసులు సామాన్యులకు మాత్రమేనా..?
- అధికారుల నిర్లక్ష్యమా.. లేక ఒత్తిళ్ల ప్రభావమా..?
- బహుళ అంతస్తుల వెనుక భారీ అక్రమాల కథ..?
- బిల్డర్ల ఇష్టారాజ్యం.. ప్రజల భద్రత గాలికొదిలేసినట్టేనా..?
- ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పేది ఎవరు..?
- చట్టం ముందు అందరూ సమానమే అయితే బిల్డర్లకు మినహాయింపెందుకు..?
- ఫిర్యాదుల ఫైళ్లు పెరుగుతున్నాయి.. చర్యలు మాత్రం కనిపించడం లేదు..!
- అక్రమ నిర్మాణాలతో ప్రభుత్వ ఖజానాకు భారీ గండి..!
- ఇంద్రేశంలో టౌన్ ప్లానింగ్ ఉందా.. లేదా..?
- అక్రమాలకు అడ్డుకట్ట వేయాల్సిన యంత్రాంగం ప్రేక్షక పాత్రలో..!
- బిల్డర్ల దూకుడు.. అధికారుల మౌనం.. ప్రజల్లో ఆగ్రహం..!
- ఇంద్రేశంలో అక్రమ నిర్మాణాల వెనుక అసలు బలం ఎవరు..?

3లో

మునుగోడు నియోజకవర్గం ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, ప్రత్యేక కృషితో చౌటుప్పల్‌కు అదనపు జూనియర్ సివిల్ కోర్టు మంజూరైంది. ఏడాదిన్నరగా పెండింగ్‌లో ఉన్న కోర్టు మంజూరు అనుమతులపై, ఆయన ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి సాధించడంతో, రాష్ట్ర ప్రభుత్వం శనివారం జీవో నెంబర్ 44 జారీ చేసింది. చౌటుప్పల్‌లో కేసుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండటంతో, అదనపు కోర్టు ఏర్పాటు చేయాలని బార్ అసోసియేషన్ చాలాకాలంగా డిమాండ్ చేస్తోంది. ఈ మేరకు హైకోర్టు గతేడాదే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా నిధుల మంజూరు జాప్యమైంది. ఈ అంశాన్ని ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగానే ఆయన న్యాయశాఖ మంత్రి, ఉన్నతాధికారులతో మాట్లాడి అనుమతులు ఇప్పించారు.

# చౌటుప్పల్‌లో అదనపు జూనియర్ సివిల్ కోర్టు మంజూరు..

**ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి ప్రత్యేక కృషి ఫ్లోరోసిస్ పీడిత మునుగోడుకు మహర్దశ.**

**అభివృద్ధి పనుల్లో రాజగోపాల్ రెడ్డి దూకుడు.**

**ఇచ్చిన మాట నిలబెట్టుకున్న నేత.. నియోజకవర్గంలో వెయ్యి కోట్లతో అభివృద్ధి రికార్డు**

**మంత్రి పదవితో మునుగోడుకు స్వర్ణయుగం..ఆకాంక్షిస్తున్న నియోజకవర్గ ప్రజలు**

కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి రాజకీయ జీవితం మొత్తం, మునుగోడు ప్రజల సంక్షేమానికే అంకితం చేశారు. ఉమ్మడి నల్గొండ జిల్లాను పట్టిపీడిస్తున్న, ఫ్లోరోసిస్ మహమ్మారిపై ఆయన చేసిన పోరాటం చిరస్మరణీయం. 2009 నుంచే ఫ్లోరైడ్ బాధితులకు సురక్షిత తాగునీరు అందించాలని అసెంబ్లీలో, బయట అలుపెరగని పోరాటం చేశారు ఆయన. మిషన్ భగీరథ ద్వారా కృష్ణా జలాలను మునుగోడు నియోజకవర్గంలోని, ప్రతి గూడెంకు తీసుకెళ్లడంలో ఆయన పాత్ర కీలకమనే చెప్పాలి. చౌటుప్పల్, సంస్థాన్ నారాయణపురం, మర్రిగూడ, నాంపల్లి, చండూరు, మునుగోడు మండలాల్లో, వేలాది కుటుంబాలకు ఆ సమయంలో ఫ్లోరైడ్ రహిత నీరు అందింది అంటే, అది ఆయన పట్టుదల ఫలితమనే

**నల్లగొండ నిఘా ప్రతినిధి(క్రైమ్ మిర్రర్):**



2లో

## నీట్ పరీక్షల కోసం కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు



**గండిపేట్ : ( క్రైమ్ మిర్రర్ ):** రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని శివరాంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న నీట్ పరీక్షల కోసం అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. పరీక్షలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసి, పరీక్షా కేంద్రాల వద్ద భారీ బందోబస్తు నిర్వహిస్తున్నారు. అభ్యర్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునేందుకు ట్రాఫిక్ నియంత్రణ చర్యలు అమలు చేశారు. పరీక్షా కేంద్రాల పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు పోలీసులు తెలిపారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారు. నీట్ పరీక్షలు సజావుగా పూర్తయ్యే వరకు భద్రతా చర్యలు కొనసాగుతాయని అధికారులు వెల్లడించారు.

# చౌటుప్పల్‌లో అదనపు జూనియర్ సివిల్ కోర్టు మంజూరు..

చెప్పాలి. ఫ్లోరోసిస్ బాధితులకు పెన్షన్లు, వైద్య సాయం అందేలా ప్రభుత్వంపై నిరంతరం కోమటిరెడ్డి ఒత్తిడి తెచ్చారు.

**మునుగోడు ఉప ఎన్నిక: ప్రజల తీర్పుతో తిరిగి గెలిచిన నేత**

మునుగోడు ఎమ్మెల్యేగా కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి రాజీనామాతో, 2022లో జరిగిన మునుగోడు ఉప ఎన్నిక, తెలంగాణ రాజకీయాల్లో సంచలనంగా మారింది. నియోజకవర్గ అభివృద్ధి కోసమే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి, మళ్లీ ప్రజాక్షేత్రంలోకి వచ్చారు రాజగోపాల్ రెడ్డి. "మునుగోడు ఆత్మగౌరవ పోరాటం" పేరుతో చేసిన ఉద్యమం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఆయన రాజీనామాతో అప్పటి టీఆర్ఎస్ ప్రభుత్వం, మునుగోడు బాట పట్టింది. దశబ్దాల నుండి మునుగోడును పట్టుకున్న గోడు, రాజీనామాతో అభివృద్ధి దిశగా అడుగులు వేసింది. అప్పటి ముఖ్యమంత్రి కేసిఆర్ తో సహా అధికార పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు, ప్రధాన పార్టీ నేతలు సైతం మునుగోడులో వాలారు. ప్రజలకు ఏ సమస్య ఉన్నా చిటికెలో, పరిష్కారం అనుమతులతో హంగామా చోటు చేసుకుంది. ఉప ఎన్నిక సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు, ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి గెలిచిన నాటి నుంచి, సొంత నిధులతో సైతం ప్రజలకు సేవ చేస్తూ అవిశ్రాంతంగా కృషి చేస్తున్నారు. నియోజకవర్గంలో 1000 కోట్లకు పైగా అభివృద్ధి పనులకు నిధులు సాధించిన ఆయన రికార్డు సృష్టించారు. ఓడిపోయినా, గెలిచినా మునుగోడు ప్రజల కోసమే పనిచేస్తానని చెప్పిన మాటను నిలబెట్టుకున్నారు.

**అభివృద్ధి పనుల్లో దూకుడు**

గత మూడేళ్లలో మునుగోడు నియోజకవర్గ రూపురేఖలు మార్చేలా రాజగోపాల్ రెడ్డి అనేక సేవా కార్యక్రమాలు, అభివృద్ధి పనులు చేపట్టారు. పలు చోట్ల 4 లేన్ల రోడ్లు, హైలెవల్ బ్రిడ్జ్ లు, ఆర్‌డబీ రోడ్డు విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. 100 పడకల ఆసుపత్రి మంజూరు, చౌటుప్పల్ ఏరియా ఆసుపత్రి ఆధునీకరణ, అన్ని పీహెచ్‌సీలలో వైద్యుల నియామకం. నియోజకవర్గంలో గురుకుల పాఠశాలల ఏర్పాటుకు కృషి, ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ క్లాస్‌రూమ్‌ల ఏర్పాటుకు కృషి, ప్రాజెక్టు కాలువల ఆధునీకరణ, చెరువుల పూడికతీత, కొత్త చెక్‌డ్యామ్‌ల నిర్మాణంతో వేల ఎకరాలకు సాగునీరును అందించడంలో కృషి చేశారు ఆయన..ఇటీవల చౌటుప్పల్‌లో సబ్ కోర్టు ఏర్పాటు కోసం న్యాయవాదులను స్వయంగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వద్దకు తీసుకెళ్లి హామీ ఇప్పించారు. ఇచ్చిన మాట ప్రకారం తొలి విడతగా అదనపు జూనియర్ సివిల్ కోర్టు సాధించి చూపారు.

**మంత్రి పదవి దక్కితే మునుగోడుకు స్వర్ణయుగం**

దశాబ్దాలుగా వెనుకబాటుకు గురైన మునుగోడు నియోజకవర్గానికి, రాజగోపాల్ రెడ్డి లాంటి డైనమిక్ నాయకుడు అవసరం. ఆయనకు మంత్రి పదవి ఇస్తే ఫ్లోరోసిస్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడమే కాకుండా, పీడితులకు న్యాయం జరుగుతుందని ప్రజల అభిప్రాయం. ఇప్పటికే కంటి వెలుగు ప్రోగ్రాంలతో, నియోజకవర్గం ప్రజలకు కంటి చూపుగా మారారు. చౌటుప్పల్‌ను పారిశ్రామిక హబ్‌గా మార్చి, యువతకు ఉపాధి కల్పించే ప్రణాళికలు ఆయన వద్ద సిద్ధంగా ఉన్నాయి. వైద్య ఆరోగ్యశాఖ, ఆర్‌డబీ, భారీ నీటిపారుదల శాఖలపై పట్టు ఉన్న, రాజగోపాల్ రెడ్డికి మంత్రివర్గంలో చోటు కల్పిస్తే ఉమ్మడి నల్గొండ జిల్లాతో పాటు, రాష్ట్రానికే మేలు జరుగుతుందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ప్రజా సమస్యలపై అసెంబ్లీలో గళమెత్తే దమ్ము, అధికారులతో పని చేయించుకునే చాణక్యం ఉన్న నాయకుడిగా ఆయనకు పేరుంది. అదనపు కోర్టు మంజూరుతో చౌటుప్పల్ న్యాయవాదులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. "ఇచ్చిన మాట నిలబెట్టుకునే నాయకుడు" అని ఎమ్మెల్యేను స్థానికులు కొనియాడుతున్నారు. మునుగోడు అభివృద్ధి రథసారథికి మంత్రి



# ప్రొఫెసర్ జయశంకర్ సార్ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు

**గండిపేట్ : ( క్రైమ్ మిర్రర్ ):** ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవితాంతం కృషి చేసిన తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కె. జయశంకర్ సార్ వర్ధంతి సందర్భంగా ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాల యంలో ఘనంగా నివాళులు అర్పించారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్య విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని జయశంకర్ సార్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించి ఆయన సేవలను స్మరించుకున్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం కోసం జయశంకర్ సార్ చేసిన త్యాగాలు, ఉద్యమంలో ఆయన పోషించిన కీలక పాత్రను ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ జి.ఈ.సి.హెచ్. విద్యాసాగర్‌తో పాటు ఇతర అధికారులు, బోధన మరియు బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొని జయశంకర్ సార్‌కు ఘన నివాళులు అర్పించారు.

# కూకట్ పల్లి లో ఘనంగా ప్రపంచ యోగ దినోత్సవం



**కూకట్ పల్లి, జూన్ 21 (క్రైమ్ మిర్రర్) :** అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని కూకట్ పల్లి నియోజకవర్గ పరిధిలోని భారతీయ యోగా సంస్థాన శివసిద్ధి కుండలని సభ్యుల ఆధ్వర్యంలో బాలాజీ నగర్ హౌసింగ్ బోర్డ్ హౌసింగ్ బోర్డ్ లో కాలనీ ఫ్రీడం పార్కులో యోగా దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ నిత్యం యోగ ను పాటించడం వలన ఆరోగ్యంతో పాటు క్రమశిక్షణ అలవాటు అవుతుందని పేర్కొన్నారు. శ్వాసను నియంత్రించడం వలన శరీరంలోని ప్రతి అవయవాన్ని మన ఆధీనంలో ఉంచుకోవచ్చని తెలిపారు. అదేవిధంగా నిత్యం మానసిక ఒత్తిడి, వృత్తిపరమైన ఒత్తిడి నుండి ఉపశమనం కలగడానికి యోగ గొప్ప ఔషధమని అభిప్రాయం వ్యక్తం చేశారు. నిత్యం యోగ ను అభ్యసించడం వలన మానసిక ఉల్లాసప పాటు, శారీరక దారుఢ్యాన్ని పెంపొందించుకోవచ్చని అన్నారు.

# యోగాతో ఆరోగ్యవంతమైన జీవితం : ఏనుగుల అనిల్ కుమార్ యాదవ్

**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్) :** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లెలగూడలోని చందన చెరువు వద్ద సత్యం యోగా సెంటర్ మరియు సబితమ్మ శక్తిదళ్ ఆధ్వర్యంలో ప్రత్యేక యోగా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. జిహెచ్ఎంసి 60వ డివిజన్ మీర్ పేట్ పరిధిలో జరిగిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళలు, యువత మరియు స్థానిక ప్రజలు పాల్గొని యోగా సాధన చేశారు. యోగా ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని నిర్వాహకులు తెలిపారు. ఆరోగ్యమే మహాభాగ్యం అనే సందేశంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో యోగా ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ప్రతిరోజూ యోగా చేయడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపవచ్చని మాజీ కార్పొరేటర్ ఏనుగుల అనిల్ కుమార్ యాదవ్ సూచించారు. ఈ సందర్భంగా సబితమ్మ శక్తి దళ్ కన్వీనర్ ఏనుగుల అనిల్ కుమార్ యాదవ్ టి షర్ట్స్ (సబితమ్మ శక్తి దళ్ పేరుతో) యోగా సాధకులకు చేతిటవాల్స్, వాటర్ బాటిల్స్, పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అనిల్ యాదవ్ యోగా గురువులను శాలువాలతో సన్మానించి అభినందించి అంతర్జాతీయ యోగా దినోత్సవ శు




భాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యోగా గురువులు సత్యం, ఆకుల శ్రీనివాస్, లక్ష్మారెడ్డి, డా శంకర్ కుమార్, మేకల కృష్ణ ముదిరాజ్, నాగయ్య ముదిరాజ్, మరియు మాజీ కార్పొరేటర్ ధనలక్ష్మి రాజ్ కుమార్, మాజీ టెంపుల్ డైరెక్టర్ మేకల యాదగిరి, కాంటెస్టడ్ కార్పొరేటర్లు అబ్బనమోని గోపి యాదవ్, బొమ్మకంటి దయానంద్ ముదిరాజ్, కర్రే వెంకటేష్ కుర్మ, నాయకులు తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమకారులు ఉప్పు నవీన్, కేతరాజు శంకర్,ఐతరాజు వెంకటేష్, చందు వద్ది రజిని కాంత్ ముదిరాజ్, శివ కృష్ణ ముదిరాజ్, సంతోష్ పాల్గొన్నారు.

# యోగా ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలి: సంతోష్ గౌడ్

**గండిపేట్ : ( క్రైమ్ మిర్రర్ ):** కాటేదాన్ డివిజన్ పరిధిలోని సాయిబాబా నగర్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని బీజేపీ సీనియర్ నాయకుడు సంతోష్ గౌడ్ కార్యాలయం వద్ద యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ సీనియర్ నాయకుడు సంతోష్ గౌడ్ మాట్లాడుతూ, యోగా భారతదేశం ప్రపంచానికి అందించిన గొప్ప వరమని అన్నారు. యోగా సాధన ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత, ఏకాగ్రత పెంపొందుతాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ నిత్యం యోగా చేయడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవనాన్ని గడపవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, యువత, మహిళలు పాల్గొని యోగా ఆసనాలు చేశారు.

# గౌతమ్ మోడల్ స్కూల్లో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

**గండిపేట్ : ( క్రైమ్ మిర్రర్ ):** అత్తాపూర్ లోని గౌతమ్ మోడల్ స్కూల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొని వివిధ యోగా ఆసనాలు, ప్రాణాయామాలు చేసి యోగా ప్రాముఖ్యతను చాటిచెప్పారు. పాఠశాల యాజమాన్యం మాట్లాడుతూ యోగా శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరమని, ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో యోగాను భాగంగా చేసుకోవాలని సూచించారు. విద్యార్థులకు యోగా వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.





## కరాటే అభివృద్ధికి అండగా అశోక్ యాదవ్ -- రూ.51 వేల విరాళం అందజేత

**గండిపేట్ : ( క్రైమ్ మిర్రర్ ):** నార్సింగి బీఆర్ అంబేద్కర్ భవన్‌లో ఆదివారం నిర్వహించిన కరాటే ఇనాగ్రేషన్ సెర్మనీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అశోక్ యాదవ్ క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ యువత క్రీడల్లో రాణించి రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కరాటే శిక్షణా కార్యక్రమాల నిర్వహణకు ప్రోత్సాహంగా ఆర్గనైజర్, కోచ్ అర్జున్ యాదవ్‌కు మల్లికార్జున స్వామి దేవాలయం, నార్సింగి తరఫున రూ. 51,000 విరాళాన్ని అందజేశారు. కరాటే వంటి మార్షల్ ఆర్ట్స్ యువతలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, శారీరక దృఢత్వాన్ని పెంపొందిస్తాయని ఆయన పేర్కొన్నారు.విరాళం అందించిన అశోక్ యాదవ్‌కు కోచ్ అర్జున్ యాదవ్‌తో పాటు నిర్వాహకులు, క్రీడాకారులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు స్థానిక ప్రముఖులు, క్రీడాభిమానులు, యువకులు పాల్గొన్నారు.

## ఎండీఆర్ ఫౌండేషన్‌కు ఇరవై మూడవ జాతీయ అవార్డు

### సామాజిక సేవా కార్యక్రమాలకు జాతీయ స్థాయిలో గుర్తింపు

**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి జూన్ 21:** పటాన్‌చెరు కేంద్రంగా గత ఎన్నో సంవత్సరాలుగా వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఎండీఆర్ ఫౌండేషన్‌కు ప్రతిష్ఠాత్మక పర్యావరణ మిత్ర జాతీయ అవార్డులు -- 2026 కార్యక్రమంలో జాతీయ అవార్డు లభించింది. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డును ప్రదానం చేశారు. హర్యానా, హిమాచల్ ప్రదేశ్ మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ముఖ్య అతిథిగా పాల్గొని ఎండీఆర్ ఫౌండేషన్ ప్రతినిధులకు అవార్డును అందజేశారు. అనాథ శవాల అంత్యక్రియలు నిర్వహించడం, పేదలకు ఆర్థిక సహాయం అందించడం, విద్యార్థులకు విద్యా ప్రోత్సాహం కల్పించడం, వైద్య సహాయం అందించడం, రేషన్ కిట్లు పంపిణీ చేయడం వంటి సేవా కార్యక్రమాలను గుర్తించి ఈ అవార్డును ప్రదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు కూన వేణు, జాతీయ చైర్మన్ డాక్టర్ యామినేని ఉప్పలరావు, సినీ నటి పూజిత జొన్నలగడ్డ, అంతర్జాతీయ మోడల్ ఆశ్రిత రొయ్యూరు తదితర ప్రముఖులు పాల్గొన్నారు. అవార్డు అందుకున్న సందర్భంగా ఎండీఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ.. ప్రజల సహకారం, ఆశీర్వాదాలతోనే ఈ గుర్తింపు లభించిందని, భవిష్యత్తులో మరింత విస్తృతంగా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు. ఎండీఆర్ ఫౌండేషన్‌కు ఇది ఇరవై మూడవ జాతీయ అవార్డు కావడం విశేషం.



# బిల్డర్ల గుప్పిట్లో ఇంద్రేశం..! అచేతన స్థితిలో అధికారులు..?

- “అనుమతులు లేకుండా అంతస్తులపై అంతస్తులు పెరుగుతుంటే అధికారులు ఏం చేస్తున్నారు..?”, “అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాల్సిన యంత్రాంగం ఎందుకు ప్రేక్షక పాత్ర పోషిస్తోంది..?”, “చట్టం అందరికీ సమానమైతే బిల్డర్ల విషయంలో ఎందుకు అమలు కావడం లేదు..?”, “ఫిర్యాదులు వచ్చినా చర్యలు లేకపోవడం వెనుక ఎవరి అండదండలు ఉన్నాయి..?” అంటూ స్థానికులు బహిరంగంగానే ప్రశ్నిస్తున్నారు.
- “అక్రమ నిర్మాణాల అడ్డాగా ఇంద్రేశం..? బిల్డర్లకు గ్రీన్ సిగ్నల్ -- చట్టానికి రెడ్ సిగ్నల్..?”






**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి, జూన్ 21:** సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని ఇంద్రేశం మున్సిపాలిటీ అక్రమ నిర్మాణాలకు కేంద్రబిందువుగా మారిందనే ఆరోపణలు రోజురోజుకు బలపడుతున్నాయి. పట్టణ అభివృద్ధి నిబంధనలను పక్కనబెట్టి అనుమతులకు విరుద్ధంగా బహుళ అంతస్తుల భవనాలు, వాణిజ్య సముదాయాలు నిర్మిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బచ్చుగూడెం, రామేశ్వరం బండ, ఇంద్రేశం తదితర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని, వీటిపై ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా స్పందన కనిపించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. స్థానికుల సమాచారం ప్రకారం ఇంద్రేశం మున్సిపాలిటీ పరిధిలో సుమారు 25 మందికి పైగా బిల్డర్లు అనుమతులు లేకుండా లేదా అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్నారని చెబుతున్నారు. నిర్మాణ అనుమతుల్లో చూపించిన అంతస్తులకు మించి అదనపు అంతస్తులు నిర్మించడం, పార్కింగ్ స్థలాలను వాణిజ్య అవసరాలకు వినియోగించడం, నిబంధనలకు విరుద్ధంగా సెట్‌బ్యాక్‌లు లేకుండా నిర్మాణాలు చేపట్టడం వంటి ఉల్లంఘనలు జరుగుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే వీటిపై చర్యలు తీసుకోవాల్సిన మున్సిపల్ అధికారులు మాత్రం మౌనం పాటిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అక్రమ నిర్మాణాలపై పలుమార్లు జిల్లా కలెక్టర్ కార్యాలయానికి, మున్సిపల్ అధికారులకు ఫిర్యాదులు అందినప్పటికీ క్షేత్రస్థాయిలో ఎలాంటి మార్పు కనిపించడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఫిర్యాదులు వచ్చినా బిల్డర్లు మాత్రం “డోంట్ కేర్” అన్న ధోరణితో నిర్మాణాలను కొనసాగిస్తున్నారని ఆరోపిస్తున్నారు. దీంతో అధికారులు నిజంగానే చర్యలు తీసుకోవాలనుకుంటున్నారా..? లేక ఏదైనా ఒత్తిళ్ల కారణంగా వెనుకడుగు వేస్తున్నారా..? అనే సందేహాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. ఇంద్రేశం ప్రాంతంలో ప్రస్తుతం కనిపిస్తున్న పరిస్థితి చూస్తే నిబంధనలు సామాన్య ప్రజలకు మాత్రమేనా..? లేక బిల్డర్లకు ప్రత్యేక మినహాయింపులున్నాయా..? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. చిన్న ఇంటి మరమ్మత్తు చేసినా, చిన్న షెడ్ నిర్మించినా వెంటనే నోటీసులు జారీ చేసే అధికారులు, భారీ బహుళ అంతస్తుల నిర్మాణాల విషయంలో ఎందుకు మౌనం పాటిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. సామాన్య ప్రజలపై చట్టం కఠినంగా అమలవుతుంటే, బిల్డర్ల విషయంలో మాత్రం నిర్లక్ష్యం ఎందుకు కనిపిస్తోందని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవడంలో రాజకీయ ఒత్తిడులు ఉన్నాయని కొందరు మున్సిపల్ వర్గాలు అనధికారికంగా చెబుతున్నట్లు సమాచారం. కొందరు ప్రభావశీల నాయకుల అండదండలతోనే బిల్డర్లు నిబంధనలను బేఖాతరు చేస్తున్నారనే చర్చ స్థానికంగా సాగుతోంది. రాజకీయ జోక్యం కారణంగానే అధికారులు కఠిన చర్యలకు వెనుకాడుతున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఈ ఆరోపణలపై అధికారికంగా ఎవరూ స్పందించకపోవడం గమనార్హం. అక్రమ నిర్మాణాల కారణంగా మున్సిపాలిటీ ఆదాయానికి కూడా భారీ నష్టం జరుగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. అనుమతులు లేకుండా అదనపు అంతస్తులు నిర్మించడం, సరైన పన్నులు చెల్లించకుండా భవనాలను వినియోగంలోకి తేవడం వల్ల ప్రభుత్వ ఖజానాకు లక్షల రూపాయల ఆదాయం కోల్పోతున్నట్లు చెబుతున్నారు. మున్సిపాలిటీకి రావాల్సిన ఆదాయం రాకపోవడం వల్ల అభివృద్ధి పనులపై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని అభిప్రాయపడుతున్నారు. పట్టణ ప్రణాళికలను ధ్వంసం చేసే విధంగా సాగుతున్న ఈ నిర్మాణాలు భవిష్యత్తులో పలు సమస్యలకు దారితీసే ప్రమాదం ఉందని పట్టణాభివృద్ధి నిపుణులు హెచ్చరిస్తున్నారు. రహదారుల వెడల్పు, డ్రైనేజీ వ్యవస్థ, పార్కింగ్ సౌకర్యాలు, ప్రజా భద్రత వంటి అంశాలు తీవ్రంగా దెబ్బతినే అవకాశం ఉందని చెబుతున్నారు. ఇప్పుడే నియంత్రణ చర్యలు చేపట్టకపోతే భవిష్యత్తులో పరిస్థితి మరింత క్లిష్టంగా మారే ప్రమాదం ఉందని సూచిస్తున్నారు.“అనుమతులు లేకుండా అంతస్తులపై అంతస్తులు పెరుగుతుంటే అధికారులు ఏం చేస్తున్నారు..?”, “అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాల్సిన యంత్రాంగం ఎందుకు ప్రేక్షక పాత్ర పోషిస్తోంది..?”, “చట్టం అందరికీ సమానమైతే బిల్డర్ల విషయంలో ఎందుకు అమలు కావడం లేదు..?”, “ఫిర్యాదులు వచ్చినా చర్యలు లేకపోవడం వెనుక ఎవరి అండదండలు ఉన్నాయి..?” అంటూ స్థానికులు బహిరంగంగానే ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు, విజిలెన్స్ మరియు టౌన్ ప్లానింగ్ విభాగాలు జోక్యం చేసుకుని ఇంద్రేశం మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై సమగ్ర విచారణ జరపాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. నిబంధనలను ఉల్లంఘిస్తున్న బిల్డర్లపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు విధుల్లో నిర్లక్ష్యం వహించిన అధికారుల బాధ్యతను కూడా నిర్ధారించాలని కోరుతున్నారు. అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేసి ప్రభుత్వ ఆదాయాన్ని కాపాడడంతో పాటు పట్టణ ప్రణాళికలను రక్షించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. “సామాన్యుడు చిన్న షెడ్ కట్టినా నోటీసులు... బిల్డర్లు బహుళ అంతస్తులు కట్టినా మౌనం... ఇంద్రేశంలో చట్టం అందరికీ సమానమేనా..?” అనే ప్రశ్న ప్రస్తుతం ప్రజల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.



# జయశంకర్ ఆశయాల సాధనకు కట్టుబడాలి: సుదర్శన్ గౌడ్

**15వ వర్ధంతి సందర్భంగా జయశంకర్ చౌక్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఘన నివాళులు**



**రామకృష్ణాపూర్, జూన్ 21(క్రైమ్ మిర్రర్):** తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య ప్రొఫెసర్ జయశంకర్ సార్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కంబగోని సుదర్శన్ గౌడ్ పిలుపునిచ్చారు. జయశంకర్ సార్ 15వ వర్ధంతి సందర్భంగా ఆదివారం పట్టణంలోని జయశంకర్ చౌక్ వద్ద బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా సుదర్శన్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జయశంకర్ సార్ జీవితాంతం అంకితభావంతో పోరాడారని అన్నారు. ఆంధ్ర,తెలంగాణ విలీనమైన నాటి నుంచే ప్రత్యేక తెలంగాణ కోసం ఉద్యమాన్ని ప్రారంభించి, తెలంగాణ భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కీలకపాత్ర పోషించారని పేర్కొన్నారు. చిన్న రాష్ట్రాలతోనే అభివృద్ధి ఫలాలు ప్రజలకు త్వరగా అందుతాయనే సిద్ధాంతంతో ఆయన చివరి శ్వాస వరకు పోరాటం చేశారని కొనియాడారు.తెలంగాణ రాష్ట్ర కల సాకారమయ్యే సమయానికి జయశంకర్ సార్ మన మధ్య లేకపోవడం బాధాకరమని, ఆయన లేని లోటు తెలంగాణ సమాజానికి తీరనిదని అన్నారు. జయశంకర్ ఆశయాలను కొనసాగించడం ద్వారానే ఆయనకు నిజమైన నివాళి అర్పించిన వారమవుతామని పేర్కొన్నారు.అనంతరం నాయకులు, కార్యకర్తలు జయశంకర్ సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జాడి శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు పోగుల మల్లయ్య, రెవెల్లి ఓదెలు, బోయినపల్లి అనిల్‌రావు, జిలుకర మహేష్, పారిపల్లి తిరుపతి, సీనియర్ నాయకులు కొండ కుమార్, అలుగుల సత్తయ్య, కౌన్సిలర్లు వీనంక శ్రీనివాస్, రంగరాజు, బొమ్మ భూమాగౌడ్, జంజిపల్లి శశికుమార్, రాజశేఖర్, యువ నాయకులు గాజుల చంద్రకిరణ్, రామిడి లక్ష్మీకాంత్, గొనె రాజేందర్, దబ్బేటి సంతోష్, నస్పూరి శివ, కార్యకర్తలు చిప్పరి సుధాకర్, లద్దూరి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యానికి మించిన ఆస్తి లేదు... జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్

- యోగతో ఆరోగ్యం... ఆరోగ్యంతో అందమైన జీవితం
- దైనందిన జీవితంలో యోగ ఒక భాగం కావాలి
- ప్రపంచ యోగా దినోత్సవంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్



**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** ఆరోగ్యానికి మించిన ఆస్తి లేదని, యోగతో ఆరోగ్యం సాధ్యమవుతుందని, ఆరోగ్యంతో అందమైన జీవితం సాధ్యపడుతుందని, ప్రతి ఒక్కరూ దైనందిన జీవితంలో యోగాను ఒక భాగంగా అలవర్చుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ తెలిపారు. ఆదివారం స్థానిక సర్దార్ పటేల్ స్టేడియంలో ఆయుష్, క్రీడల శాఖల ఆధ్వర్యంలో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం -- 2026 కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ స్వయంగా యోగా ఆసనాలు చేస్తూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర్ మాట్లాడుతూ యోగ అనేది కేవలం వ్యాయామం మాత్రమే కాదని, శారీరక ఆరోగ్యం, మానసిక ప్రశాంతత, క్రమశిక్షణతో కూడిన జీవన విధానమని అన్నారు. యోగా దినమున జరిగే కార్యక్రమంలో ఆయుష్ శాఖ వారు పాల్గొనేవారని, ఇక్కడ పౌర సమాజం నుండి పెద్ద సంఖ్యలో పాల్గొనడం శుభసూచకమని అన్నారు. వయస్సుతో సంబంధం లేకుండా చిన్న పిల్లల నుండి వృద్ధుల వరకు కార్యక్రమంలో పాలుపంచుకుంటున్నారని అన్నారు.

ప్రతి ఒక్కరూ యోగాను దైనందిన జీవితంలో భాగం చేసుకుని ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి కృషి చేయాలని తెలిపారు. ప్రస్తుత కాలంలో మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లు, సాంకేతిక సౌకర్యాలు పెరుగుదల కారణంగా మనిషి శారీరక శ్రమకు దూరమవుతూ అనేక రకాల అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని అన్నారు. ప్రతి మనిషికి ఉన్న అత్యంత విలువైన ఆస్తి ఆరోగ్యం అని, ఆరోగ్యం బాగోలేకపోతే జీవితంలో ఎంత సాధించినా దానిని పూర్తిగా ఆస్వాదించలేమని తెలిపారు. ఆరోగ్యంగా ఉండటమే ప్రతి వ్యక్తి జీవితానికి బలమైన పునాది అని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి సునీల్ రెడ్డి, డిసిహెచ్ఎస్ డా. రాజశేఖర్, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవిబాబు, ఉప వైద్యాధికారి డా. వేణుమాధవ్, నోడల్ అధికారిణి డా. పద్మావతి, నేచురోపతి డాక్టర్ కనకమహాలక్ష్మి, జిల్లా అధికారులు, విద్యార్థులు, యువత, మహిళలు, యోగా సాధకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# జగన్నాథ స్వామి ఆలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

**కాటేదాన్‌లో ఆధ్యాత్మిక శోభ.. ప్రారంభమైన పూరి జగన్నాథ్ ఆలయం**



**గండిపేట్ : ( క్రైమ్ మిర్రర్ ):** కాటేదాన్‌లో నూతనంగా నిర్మించిన పూరి జగన్నాథ్ మందిరాన్ని ఆదివారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు, యాత్రలో ఎమ్మెల్యే పాల్గొని భక్తులతో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు.మందిర ప్రారంభోత్సవ వేడుకలు భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా జరిగాయి. ఆలయ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ప్రేమ్ దాస్ గౌడ్, తిరుమల వెంకటేష్ గౌడ్, మాజీ వార్డు మెంబర్ సోమ శ్రీనివాస్ గుప్తా, సందీప్ గుప్తా, మానస్ పాండే, సత్యానంద్ పాండే, దిలీప్ మహంతి, హరీష్, అభిమన్యు, భగవాన్ తాండ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

# శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం



**గండిపేట్ : ( క్రైమ్ మిర్రర్ ):** రాజేంద్రనగర్ సర్కిల్ బండ్లగూడ జాగిర్ శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో నూతన దేవాలయ కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ సమావేశంలో ఎన్నికల అధికారి చీకటిమర్ల సురేష్, దేసు వెంకటేశ్వరరావు నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు.ఆలయ కమిటీ అధ్యక్షుడిగా విశ్వనాథం సురేందర్, ప్రధాన కార్యదర్శిగా మేడిశెట్టి సుధాకర్, కోశాధికారిగా దేసు మల్లేష్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు వెల్లడించారు. గతంలో నిర్ణయించిన తేదీ ప్రకారం ఆలయంలో నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు విశ్వనాథం సురేందర్ మాట్లాడుతూ, వచ్చే రెండు సంవత్సరాల్లో ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు.సుమారు 150 మంది సభ్యుల సమక్షంలో అట్టహాసంగా జరిగిన ఈ కార్యక్రమంలో వేద పండితులు ఆశీర్వచనాలు అందించారు. అనంతరం సభ్యులు, భక్తులు ప్రసాదం స్వీకరించి నూతన కార్యవర్గాన్ని అభినందిస్తూ ఆశీర్వదించారు. ఈ సమావేశంలో ఎన్నుకోబడిన మెంబర్లు ఉపాధ్యక్షులుగా శ్రీపురం పురుషోత్తం, వేముల రాములు, అడ్వైజర్స్ లు నాదెళ్ల రామాంజనేయులు, రవి కంటి కిషన్, జాయింట్ సెక్రెటరీ కౌకుంట్ల వినయ్ కుమార్, జాయింట్ ట్రెజరర్ బిలకంటి హరీష్ ఎన్నుకోబడ్డారు అని తెలిపారు.

# ప్రగతి నగర్ లో జయశంకర్ సార్ వర్ధంతి వేడుకలు

**?నిజాంపేట్, జూన్ 21 (క్రైమ్ మిర్రర్):** తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ వర్ధంతిని పురస్కరించుకొని ప్రగతి నగర్ ఏలెప్ సర్కిల్‌లోని ఆయన విగ్రహానికి స్థానిక నాయకులు, కాలనీవాసులు ఘనంగా నివాళులర్పించారు. విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ?ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. నీళ్లు, నిధులు, నియామకాల కోసం జయశంకర్ సార్ చేసిన మేధోపరమైన పోరాటం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రగతి నగర్ నాయకులు బోట్ల తిరుపతి, తుమ్మేటి శరత్ రెడ్డి, వడ్లకొండ సందీప్, మెరుగు రమేష్, విజయభాస్కర్ రెడ్డి, విగ్రహ కమిటీ ప్రతినిధులు శివ, రవి, వేణు తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా చైర్మెన్ గా యాహియఖాన్



**క్రైమ్ మిర్రర్, కల్వకుర్తి:** కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ నాగర్ కర్నూల్ జిల్లా చైర్మెన్ గా కల్వకుర్తి పట్టణానికి చెందిన యాహియఖాన్ నియమితులయ్యారు. ఆదివారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా చైర్మెన్ యాహియఖాన్, కల్వకుర్తి పట్టణం మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్, మున్సిపాలిటీ వైస్ చైర్మెన్ షానవాజ్ ఖాన్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పుస్తకాల రాహుల్ తో కలిసి రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ మల్లు రవి, ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, వంశీకృష్ణ, కూచుకుల్ల రాజేష్ రెడ్డి లను పూల బొకేతో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ డాక్టర్ మల్లు రవి, ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, వంశీకృష్ణ, కూచుకుల్ల రాజేష్ రెడ్డి లు కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ నాగర్ కర్నూల్ జిల్లా చైర్మన్ గా నియమితులైన యాహియ ఖాన్ ని శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వహీద్, సోఫీ, మంజూర్, తదితరులు పాల్గొన్నారు.

# అరుణ బుద్ధారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు

**గండిపేట్ : ( క్రైమ్ మిర్రర్ ):** ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని అత్తాపూర్‌లో ఉన్న యాక్టివ్ రూట్స్ స్టూడియోలో ప్రత్యేక యోగా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఇండియాస్ ఫస్ట్ వరల్డ్ కప్ మెడలిస్ట్ అరుణ బుద్ధారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్ర మంలో యోగా సాధకులు, యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అరుణ బుద్ధారెడ్డి మాట్లాడుతూ, యోగా కేవలం వ్యాయామం మాత్రమే కాకుండా ఆరోగ్యకరమైన జీవనశైలికి మార్గమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ యోగాను తమ దినచర్యలో భాగంగా చేసుకోవాలని, రోజూ యోగాసనాలు చేయడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుచు కోవచ్చని సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న వారు వివిధ యోగా ఆసనాలను ప్రదర్శించి యోగా ప్రాధాన్యతను చాటిచెప్పారు. యోగా ద్వారా ఆరోగ్యం, ఆత్మవి శ్వాసం, మానసిక ప్రశాంతత పెంపొందుతాయని నిర్వాహకులు తెలిపారు.



# పెండింగ్ లో ఉన్న 6 డి ఏ లను విడుదల చేయడంతో పాటు పిఆర్సి ని వెంటనే ప్రకటించాలి




**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఖమ్మం జిల్లా కార్య వర్గ సమావేశం ఈరోజు ఉదయం జిల్లా అధ్యక్షులు శ్రీ ఎల్ గోపీచంద్ అధ్యక్ష తన ఖమ్మం మంచికంటిభవన్ నందు నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా గౌరవ అధ్యక్షులు ఎల్ గోపీచంద్, శ్రీ వి మల్లికార్జునరావు మాట్లాడుతూ ప్రభుత్వం రిటైర్ అయిన ఉద్యోగస్తుల బకాయిలను చెల్లించకుండా 6 డి ఏ లను విడుదల చేయకుండా పిఆర్సి ని ప్రకటించకుండా ఎంప్లాయ్ హెల్త్ కార్డ్స్ కి సంబంధించిన ట్రస్ట్ ను ఏర్పాటు చేయకుండా హడావిడిగా ఉద్యోగుల మరియు పెన్షనర్ల వేతనాల నుండి 1.5% నగదు మే నెల వేతనాల నుండి మినహాయించడం జరిగిందని. కేవలం హెల్త్ కేర్ ట్రస్ట్ ను మాత్రమే ఏర్పాటు చేశారు కానీ దాని సమావేశం నిర్వహించడం కానీ మార్గదర్శకాలు విడుదల చేయటం గాని పానెల్ ఆసుపత్రులను నిర్ణయించడం గానీ జరగలేదని హెల్త్ కార్డులు అందించేయలేదని, కోత విధించి 20 రోజులు గడిచినను దాని ప్రయోజనాలు ఏ ఒక్కరికి అందలేదని ఈ మధ్యకాలంలో ఆసుపత్రి పాలైన వారు స్వంత ఖర్చుల తోటే వైద్యం చేయించుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తూ వెంటనే నగదు రహిత వైద్యాన్ని అందించాలని, రిటైర్ అయిన ఉద్యోగస్తులకు వెంటనే పెండింగ్లో ఉన్న ఆరు డి ఏ లను విడుదల చేయాలని పిఆర్సిని వెంటనే ప్రకటించాలని సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేయడం జరిగింది. సమావేశంలో ఇంచార్జ్ ప్రధాన కార్యదర్శి శ్రీ నెల్లూరి వీరబాబు గత నాలుగు నెలలుగా జరిగిన కార్యకలాపాల నివేదిక ప్రవేశ పెడుతూ సంఘం తరఫున రిటైర్ అయిన ఉద్యోగస్తులకు పెన్షన్ ఇప్పించడం మరియు పెన్షనర్లు ఎవరైనా మరణించినట్లయితే వారి జీవిత భాగస్వాములకు ఫ్యామిలీ పెన్షన్ ఇప్పించుటకు కృషి చేయడంతో పాటు కోల్ మైన్స్ ఎంప్లాయిస్ కు సంబంధించిన సమస్యలపై రెప్రజెంటేషన్ చేయటం జరిగిందని ఆర్టీసీ సమ్మెకు మద్దతు తెలియజేయతూ వారి సమస్యలపై నిరంతరం పోరాడుతున్నామని ఏపీఎస్ పెన్షనర్ల కనీస పెన్షన్ 9000 పెంచడానికి నిరంతర కృషి చేస్తున్నామని తెలియ చేయడం జరిగింది కార్యదర్శి నివేదికపై ఖమ్మం జిల్లాలో కల 12 డివిజన్ల బాధ్యులు పాల్గొని వారి సూచనలు సలహాలు ఇవ్వడం జరిగింది. సమావేశంలో ఈ మధ్యకాలంలో రిటైర్ అయిన ఉద్యోగస్తుల్ని సన్మానించి సంఘంలోకి ఆహ్వానించడం జరిగింది. సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు శ్రీమతి పి ఝాన్సీ కుమారి,వై రవికుమార్, జిల్లా కార్యదర్శులు వై శ్రీనివాసరావు, కే కుటుంబరావు, వైకుంఠరావు, భాస్కర్ రెడ్డి, మీరా ఖాన్, లక్ష్మణరావు, కె రాములమ్మగారు చిట్టెమ్మగారు రమణశేఖరం ఆంజనేయులు, అంజయ్య, గణపతి, స్వామి, ప్రసాద్, రాజేంద్రప్రసాద్, శ్రీధర్ రావు రామకృష్ణ కె వెంకటేశ్వరావు చంద్రశేఖరరావు రంగయ్య యం నరసింహారావు పాల్గొన్నారు.

# బండ్లగూడలో దౌర్జన్యం: తెల్లవారుజామున ఇల్లు, ప్రహరీ గోడ కూల్చివేత!

**నేను బతికుండగానే చనిపోయినట్టు నకిలీ పత్రాలు సృష్టించారు**

**బాధితుడు ముకుందా నందు ఆవేదన..**



**?గండిపేట్:. ( క్రైమ్ మిర్రర్ ):** రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని బండ్లగూడ జాగిర్ అభ్యుదయ నగర్ కాలనీలో ఆదివారం తెల్లవారుజామున తీవ్ర దౌర్జన్యం చోటుచేసుకుంది. ఎవరూ లేని సమయం చూసి కొందరు వ్యక్తులు జేసీబీలతో వచ్చి ఓ ఇంటిని, దాని ప్రహరీ గోడను అక్రమంగా కూల్చివేశారు. ఈ ఘోర ఘటనపై బాధితుడు ముకుందా నందు మీడియా సమావేశంలో కన్నీటిపర్యంతమవుతూ తన గోడును వెళ్లబోసుకున్నారు. బాధితుడు ముకుందా నందు భార్య భర్తలు తెలిపిన వివరాల ప్రకారం... అభ్యుదయ నగర్ కాలనీలోని సర్వే నెంబర్ 48, 49 లో గల ప్లాట్ నెంబర్ 246 లో తనకు 267 గజాల ప్లాట్ ఉంది. తాను ఎంతో కష్టపడి, ఉద్యోగం చేస్తూ సంపాదించిన డబ్బుతో ఈ ఆస్తిని కొనుగోలు చేశానని ఆయన పేర్కొన్నారు. కాగా, గత నాలుగు సంవత్సరాల క్రితం ఈ ప్లాట్‌ను తాను నరేందర్ అనే వ్యక్తికి విక్రయించినట్లు చెప్పారు. అయితే, ఈ విలువైన ప్రాపర్టీపై కన్నేసిన మల్లేష్ గౌడ్, సుందర్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్ అనే వ్యక్తులు దౌర్జన్యానికి దిగారని బాధితుడు ఆరోపించారు. ఆదివారం తెల్లవారుజామున 4 గంటల ప్రాంతంలో జేసీబీ సహాయంతో ప్లాట్‌లో నిర్మించి ఉన్న ప్రహరీ గోడను, ఇంటిని పూర్తిగా కూల్చివేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

**"నేను బతికుండగానే చనిపోయినట్టు సృష్టించారు"**

ఈ సందర్భంగా ముకుందా నందు మాట్లాడుతూ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. "నేను బతికుండగానే చనిపోయినట్లు సదరు వ్యక్తులు నకిలీ పత్రాలు సృష్టించారు. ఈ విలువైన భూమిని





అక్రమంగా కాజేయడానికే వారు ఈ దారుణమైన కుట్ర పన్నారు" అని ధ్వజమెత్తారు.

**న్యాయం చేయాలని డిమాండ్..**

తన కష్టార్జితమైన ఆస్తిని అక్రమంగా లాక్కోవడమే కాకుండా, ప్రవర్తించి కూల్చివేతలకు పాల్పడిన మల్లేష్ గౌడ్, సుందర్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్‌లపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని బాధితుడు డిమాండ్ చేశారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని ఆయన వేడుకున్నారు.

# కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు

**ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్**



**గండిపేట్ : ( క్రైమ్ మిర్రర్ ):** రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. యోగా గురువు భద్రయ్య ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై య్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ, యోగా అనేది శారీరక, మానసిక, ఆధ్యాత్మిక ఆరోగ్యానికి అత్యుత్తమ సాధనమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ యోగాను తమ నిత్య జీవితంలో భాగంగా చేసుకుని ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవరచుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రముఖ లైఫ్ కోచ్, యోగా ట్రైనర్ మహేంద్ర గురువు పాల్గొని మాట్లాడుతూ, యోగా వల్ల కండరాల బలం పెరగడంతో పాటు ఎముకలు దృఢంగా మారతాయని, జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, మానసిక ప్రశాంతత మెరుగుపడతాయని తెలిపారు. కార్యక్రమానికి హాజరైన సాధకులు మాట్లాడుతూ, యోగా దినోత్సవ వేడుకల్లో పాల్గొనడం తమకు ఆనందం, ఉల్లాసం, ఆత్మవిశ్వాసాన్ని నింపిందన్నారు. భారతీయ సంస్కృతికి ప్రతీక అయిన యోగా నేడు ప్రపంచవ్యాప్తంగా విశేష ఆదరణ పొందడం గర్వకారణమని అభిప్రాయపడ్డారు. ఈ వేడుకల్లో మాజీ కార్పొరేటర్ టి. ప్రేమ్ దాస్ గౌడ్ , టి. ప్రేమ గౌడ్ తో పాటు పలువురు స్థానిక నాయకులు, యోగా సాధకులు పాల్గొన్నారు. అర్థం లక్ష్మయ్య గుప్తా, డివిజన్ అధ్యక్షులు ధనుంజయ, సోమ శ్రీనివాస్ గుప్తా, కళ్లెం లక్ష్మారెడ్డి, బాస శ్రీనివాస్ నేత, గట్టయ్య, సరాబు అనంత గుప్తా, ఎల్లప్ప, బండారి కృష్ణయ్య, వెంకటేశ్వరరావు, రవీందర్, వీరేందర్, విజయలక్ష్మి, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం



**క్రైమ్ మిర్రర్ ఖమ్మం జిల్లా:** 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల తనికెళ్ళ మండలం నందు ఖమ్మం మేరా యువ భారత్ ఆధ్వర్యంలో ఘనంగా యోగ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కళాశాల ప్రిన్సిపాల్స్ రజిని, మేరా యువ భారత్, జిల్లా యువజన అధికారి ఎం. వెంకట్ రాంబాబు మరియు కే. భానుచందర్, జాగృతి యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు సయ్యద్ సయ్యద్ షారుక్ ఇమ్రాన్ వారు మాట్లాడుతూ అంతర్జాతీయ యోగ దినోత్సవము ప్రతి సంవత్సరం జూన్ 21న జరుపుకుంటారు. 2014 సెప్టెంబరు 27న భారత ప్రధాని సరేంద్రమోడీ ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో ప్రతిపాదన చేశారనీ, ఈ తీర్మానానికి 193 ఐరాస ప్రతినిధులలో 175 మంది మద్దతు ఇచ్చారనీ, యోగా అనేది మానవులకు మంచే కలుగజేస్తుందని, యోగ ప్రతిరోజు చేయడం వలన జీర్ణ వ్యవస్థ రక్త ప్రసరణ వ్యవస్థ మెరుగుపడుతుందని సకల రోగాలకు బెడ్ పెడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ డిపార్ట్మెంట్ యోగా మాస్టర్ పి. సంధ్య శరీర, మానసిక ఆరోగ్యానికి యోగాసనాలు ఎంతో మేలు చేస్తాయి. ఇవి ఒత్తిడిని తగ్గించి, కండరాలను దృఢపరుస్తాయి. తడాసనం, వజ్రాసనం, భుజంగాసనం, విద్యార్థులతో యోగ ఆసనాలు వేయించడం జరిగింది. ఒత్తిడి, ఆందోళనలను దూరం చేసి మనస్సుకు ప్రశాంతతను ఇస్తుంది అని అన్నారు. మరియు కొంతమంది విద్యార్థులు వ్యాస రచన పోటీలలో పాల్గొనగా అందులో మొదటి మరియు ద్వితీయ బహుమతులు అందజేయడం జరిగింది. పి.ఇ.టి, రమ్య అనంతరం విద్యార్థులతో యోగ ఆసనం లోగో ప్రదర్శించడం జరిగింది. కార్యక్రమానికి సహకరించిన ప్రిన్సిపాల్ గారికి మేరా యువ భారత్ మరియు జాగృతి యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు ధన్యవాదాలు తెలిపారు

# కేజీబీవీలు, యూఆర్ఎస్, మోడల్ స్కూళ్లకు ఆహార పదార్థాల సరఫరాకు షార్ట్ టెండర్ల ఆహ్వానం

**డీఈఓ రమేష్ కుమార్**



**క్రైమ్ మిర్రర్, కల్వకుర్తి:** నాగర్‌కర్నూల్ జిల్లా సమగ్ర శిక్ష పరిధిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు (కేజీబీవీలు), యూఆర్ఎస్, మోడల్ స్కూళ్లకు 2026–27 విద్యా సంవత్సరానికి అవసరమైన ఆహార పదార్థాల సరఫరా కోసం షార్ట్ టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి, ఎక్స్‌అఫీషియో జిల్లా ప్రాజెక్టు అధికారి (సమగ్ర శిక్ష) తెలిపారు. నాగర్ కర్నూల్ జిల్లాలోని 20 కేజీబీవీలు, ఒక యూఆర్ఎస్, రెండు మోడల్ స్కూళ్లకు కూరగాయలు, పండ్లు, మటన్, చికెన్ సరఫరా చేయుటకు ఆసక్తి గల టెండరుదారుల నుండి సీల్డ్ టెండర్లు కోరుతున్నట్లు డిఇఒ రమేష్ కుమార్ ప్రకటనలో తెలిపారు. టెండరుదారులు నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన వారై ఉండి, స్థానికంగా చెల్లుబాటు అయ్యే లైసెన్స్ కలిగి ఉండాలని, కనీసం మూడు సంవత్సరాల అనుభవం ఉండాలని నిబంధనల్లో పేర్కొన్నారు. అలాగే గత మూడు సంవత్సరాల ఆదాయపు పన్ను (ఇన్‌కమ్ ట్యాక్స్) మరియు జీఎస్టీ నమోదు పత్రాలు సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. టెండర్ ఫారాలు జూన్ 22, 2026 నుంచి అందుబాటులో ఉండగా, జూన్ 25, 2026 సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులను స్వీకరిస్తారు. టెండర్లను జూన్ 27, 2026 ఉదయం 11 గంటలకు నాగర్‌కర్నూల్ కలెక్టరేట్‌లోని జాయింట్ కలెక్టర్ చాంబర్‌లో తెరవనున్నట్లు డిఇఒ వెల్లడించారు. కూరగాయలు, పండ్లు, మటన్, చికెన్ సరఫరా టెండర్లకు రూ.2,000 చొప్పున టెండర్ ఫీజు, రూ.40,000 చొప్పున ఈఎండీ (ఎర్నెస్ట్ మనీ డిపాజిట్) చెల్లించాల్సి ఉంటుంది. టెండర్ ఫారాలు జిల్లా కలెక్టర్ మరియు సమగ్ర శిక్ష చైర్మన్, నాగర్‌కర్నూల్ వారి పేరుపై పొందవచ్చని ఆయన తెలిపారు. అర్హత కలిగిన సరఫరాదారులు నిర్దేశిత గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి రమేష్ కుమార్ సూచించారు.



# స్వయం ఉపాధితోనే యువతకు ఉజ్వల భవిష్యత్తు

**ఇ.ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ ఇరుగదిండ్ల భాస్కర్**

**ఆదిత్య డయాగ్నోస్టిక్ సెంటర్ ప్రారంభం**

**చౌటుప్పల్, జూన్ 21, క్రైమ్ మిర్రర్ :** యువత స్వయం ఉపాధి రంగాల్లో రాణిస్తూ ఆర్థికాభివృద్ధి సాధించాలని ఇ.ఎల్.వి భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ ఇరుగదిండ్ల భాస్కర్ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణ కేంద్రంలోని చిన్నకొండూర్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ఆదిత్య డయాగ్నోస్టిక్ సెంటర్‌ను ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ఘనంగా ప్రారంభించారు. ఆయనతో పాటు ఫౌండేషన్ సభ్యులు రక్త పరీక్షలు చేయించుకున్నారు. ప్రారంభోత్సవ కానుకగా 20,000 వేల రూపాయలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని, ముందస్తు ఆరోగ్య పరీక్షలు ఎంతో మేలు చేస్తాయని తెలిపారు. యువత కేవలం ఉద్యోగాల కోసమే వేచి చూడకుండా, స్వయం ఉపాధి మార్గాలను ఎంచుకుని తోటి వారికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలన్నారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందిస్తూ, ప్రజల నమ్మకాన్ని పొందాలని సూచించారు. విద్యా, వైద్యం, ఉపాధి కల్పనకు ఫౌండేషన్ ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు.

### అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రేమవతి పేటలో యోగా కార్యక్రమం

**గండిపేట్ : ( క్రైమ్ మిర్రర్ ):** భారతీయ జనతా పార్టీ రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడు పసుపుల సందీప్ ముదిరాజ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రేమవతి పేట ప్రభుత్వ పాఠశాలలో యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రంగారెడ్డి జిల్లా కార్యదర్శి మల్లేష్ యాదవ్ మాట్లాడుతూ, యోగా భారతదేశం ప్రపంచానికి అందించిన గొప్ప వరమని పేర్కొన్నారు. యోగాభ్యాసం ద్వారా ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు విద్య, క్రమశిక్షణ, మంచి అలవాట్లు అలవడతాయని అన్నారు. ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ యోగా చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యోగా గురువులు మూల్ చంద్ శర్మ, అజిత్ సింగ్, హరి కిషన్, సోల్కర్ రెడ్డి పాల్గొని యోగాసనాలను ప్రదర్శించారు. అలాగే డివిజన్ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి, పద్మావతి, భవాని దాస్, నారతం రెడ్డి, మురళీమోహన్, ఆగపల్లి నరసింహా, దయానంద్, జంగయ్య, యాదగిరి యాదవ్, ఈశ్వర్, రాజు రెడ్డి, భాష తదితర నాయకులు పాల్గొన్నారు.



# ఫైలాన్ పార్క్ లో అంతర్జాతీయ యోగా దినోత్సవం



**చౌటుప్పల్,జూన్ 21, క్రైమ్ మిర్రర్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని ఫైలాన్ పార్క్ లో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. యునాని వైద్యాధికారి డాక్టర్ రోజ్ మేరీ యోగా ప్రాముఖ్యతను వివరించారు. యోగ, ధ్యాన సాధనతో శారీరక మానసిక ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా వివిధ యోగాసనాలు, ధ్యానం చేసే పద్ధతులను ఈ ఉత్సవంలో పాల్గొన్న వారికి నేర్పించారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ ప్రకృతి వైద్యశాల యోగ శిక్షకురాలు అశ్విని, విశ్రాంత సామాజిక ఆరోగ్య అధికారి శ్రీరాములు, యోగ సాధకులు పాలకూర్ల సాత్విక్ గౌడ్, వీ. ఝన్సీ తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్మీనగర్ పార్కులో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం వేడుకలు







**గండిపేట్ : ( క్రైమ్ మిర్రర్ ):** హైదర్గూడా డివిజన్‌లోని లక్ష్మీనగర్ పార్కులో ఆదివారం నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమం కన్నుల పండుగగా సాగింది. యోగా ప్రాముఖ్యతను తెలియజేస్తూ నిర్వహించిన ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని యోగా ఆసనాలు చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ యోగా శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరమని, ప్రతిరోజూ యోగా చేయడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవనం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న వారందరూ యోగా పట్ల అవగాహన పెంపొందించుకోవాలని, యోగాను నిత్య జీవితంలో భాగంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. యోగా దినోత్సవ వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించబడగా, స్థానిక ప్రజలు విశేషంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగా ఎంతో మేలు

### జడ్.పి.హెచ్.ఎస్ ప్రధానోపాధ్యాయులు కర్నే శివకుమార్

**చౌటుప్పల్,జూన్ 21, క్రైమ్ మిర్రర్:** శారీరక,మానసిక ఆరోగ్యానికి యోగా ఎంతో మేలు చేస్తుందని జడ్. పి. హెచ్. ఎస్ ప్రధానోపాధ్యాయులు కర్నే శివకుమార్ తెలిపారు. ఆదివారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యోగా దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కర్నే శివకుమార్ మాట్లాడుతూ... విద్యార్థులు శారీరకంగా మరియు మానసికంగా ఉత్సాహంగా ఉండుటకై ప్రతిరోజు యోగా చేయడం అవసరమని తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా యోగాను ప్రతిరోజు పాఠశాల విద్యార్థులకు నేర్పించే విధంగా పీరియడ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించింది కావున విద్యార్థులంతా యోగాను ప్రతిరోజు అభ్యాసం చేసి ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలని ప్రధానోపాధ్యాయులు కోరారు. పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ ఎన్ శోభ, యోగా గురువు యువరాజు



విద్యార్థుల చేత యోగాసనాలు వేయించారు. యోగ ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సిహెచ్ రాంబాబు,జి భాస్కర్, జానకమ్మ, హేమలత, సలోమి, సి హెచ్ నర్సయ్య, మాధవి రెడ్డి, కే వాణి, నవమి, నీరద, ఎం నాగలక్ష్మి,సంధ్యారాణి, జి నరేష్, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# తెలంగాణ బీసీ విద్యార్థి సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మహేష్ గౌడ్




**నూతనకల్ ( క్రైమ్ మిర్రర్):** నూతనకల్ మండల పరిధిలోని మాచినపల్లికి చెందిన మొరిగాల మహేష్ గౌడ్ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులుగా నియమితులయ్యారుహైదరాబాద్‌లో బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్ గౌడ్ ఆయనకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మొరిగాల మహేష్ గౌడ్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తూ, బీసీ విద్యార్థుల సమస్యల పరిష్కారం, ఫీజు రియంబర్స్మెంట్ హాస్టల్ సమస్యలపై నిరంతరం పోరాడుతానని పేర్కొన్నారు. తన ఎన్నికకు సహకరించిన బీసీ సంఘం నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.

# కోకాపేట్ కొత్తచెరువు వద్ద యోగా దినోత్సవ వేడుకలు

### పాల్గొన్న పీసీసీ ప్రతినిధి ముంగి జైపాల్ రెడ్డి

**గండిపేట్ : ( క్రైమ్ మిర్రర్ ):** అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నార్సింగి సర్కిల్ పరిధిలోని కోకాపేట్ కొత్తచెరువు వద్ద నిర్వహించిన యోగా కార్యక్రమంలో పీసీసీ ప్రతినిధి ముంగి జైపాల్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన యోగా సాధనలో పాల్గొని, యోగా ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని పేర్కొన్నారు. ప్రజలు తమ దైనందిన జీవితంలో యోగాను భాగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, యువత మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ తోనే అభివృద్ధి సాధ్యం

### టీపీసీసీ సభ్యులు ఆయిళ్ళ శ్రీనివాస్ గౌడ్

**క్రైమ్ మిర్రర్, కల్వకుర్తి (కడ్తాల్):**కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలు ఒక్కొక్కటి నెరవేరుస్తూ ఇచ్చిన మాటకు కట్టుబడి ఉందని టిపిసిసి సభ్యులు శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఆదివారం కడ్తాల మండల కేంద్రంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నర్సింహా ముదిరాజ్ మండల పార్టీ అధ్యక్షులు సభవత్ బిచ్య నాయక్ కడ్తాల్ సర్పంచ్ బిక్షపతి తో కలిసి శ్రీనివాస్ గౌడ్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ తోనే అభివృద్ధి సాధ్యం అని సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్ళలాగా రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం ముందుకెళ్తుందని అన్నారు. విద్య, వైద్యం, ఉద్యోగం, ఉపాధికి రైతులకు, మహిళా సాధికారతకు ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని చెప్పారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధిలో దూసుకుపోతోందని అన్నారు. సోమవారం రోజు కడ్తాల్ మండల కేంద్రంలో కోటి రూపాయలతో కొత్తగా నిర్మించిన ఎంపీడీవో కార్యాలయ నూతన భవనాన్ని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అధ్యక్షతన పంచాయతీ రాజ్ శాఖ మంత్రి దనసరి సీతక్క ఎంపీ మల్లు రవితో కలిసి ప్రారంభోత్సవం చేస్తారని ఈ కార్యక్రమాన్ని ఆయా మండలాలు కార్యకర్తలు నాయకులు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలి కోరారు. అనంతరం తలకొండపల్లి మండలం గట్టుప్పలపల్లి లో ఏర్పాటుచేసిన యూనియన్ బ్యాంక్ ను ఎంపీ మల్లు రవి ఎమ్మెల్యే తో కలిసి ప్రారంభించనున్నట్లు వారు తెలిపారు. సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు రామకృష్ణ, పార్టీ టౌన్ ప్రెసిడెంట్ మాలే మల్లేష్ గౌడ్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బోసు రవి, వార్డు సభ్యులు జాంగిర్ బాబా, రమేష్, తుల్సిరాం నాయక్, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.



# సభల్లో ఎస్సీ హామీ... అధికారంలోకి వచ్చాక మౌనం: గోపి రజక

**రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని ప్రభుత్వానికి డిమాండ్**



**వికారాబాద్, జూన్ 21(క్రైమ్ మిర్రర్):** ఎన్నికల ప్రచార సభలు, సమావేశాల్లో రజకులను ఎస్సీ జాబితాలో చేర్చుతామని హామీలు ఇచ్చిన రాజకీయ పార్టీలు, నాయకులు అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ అంశాన్ని పూర్తిగా విస్మరించారని తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షులు గోపి రజక ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం వికారాబాద్ జిల్లా కేంద్రంలో తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్. రవీందర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు గోపి రజక, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు అన్నారం సాయిలు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. రాష్ట్ర అధ్యక్షులు గోపి రజక మాట్లాడుతూ భారత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ దోబీల సామాజిక, ఆర్థిక పరిస్థితులను గుర్తించి దోబీల అభ్యున్నతి కోసం దేశవ్యాప్తంగా ఏకరీతి విధానం అవసరమని 1984లో వారిని ఎస్సీ జాబితాలో చేర్చే దిశగా 56/1984 ఆర్డినెన్స్‌ను తీసుకువచ్చారని, అది ఆమె దూరదృష్టికి నిదర్శనమని తెలిపారు. రజకుల సమస్యల పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. వికారాబాద్ జిల్లా అధ్యక్షులు ఎస్ రవీందర్ మాట్లాడుతూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యలు, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఎన్నికల ప్రచార సభల్లో ఇచ్చిన హామీలు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు యువగళం పాదయాత్ర సందర్భంగా వ్యక్తం చేసిన అభిప్రాయాలు, బీజేపీ 2018 ఎన్నికల మేనిఫెస్టోలో చేసిన వాగ్దానాలు, ఎంపీ డీకే అరుణ ఇచ్చిన హామీ, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత శాసన మండలిలో చేసిన వ్యాఖ్యలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు అన్నారం సాయిలు మాట్లాడుతూ రజకులు ఎస్సీ జాబితాలో చేరేందుకు అన్ని విధాలుగా అర్హులని, ఈ అంశానికి దేశంలోని ప్రధాన రాజకీయ పార్టీలు, పలు ఎస్సీ సంఘాలు కూడా మద్దతు తెలుపుతున్నాయని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీలో ప్రత్యేక బిల్లు ప్రవేశపెట్టి రజకులను ఎస్సీ జాబితాలో చేర్చే ప్రక్రియను ప్రారంభించాలని కోరారు. ఈ సమావేశంలో తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి వికారాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటప్ప (దౌల్తాబాద్), జిల్లా మహిళా అధ్యక్షురాలు లక్ష్మీ, లలిత, గౌటికె నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఫ్యూచర్ సిటీ పేరుతో గిరిజన భూముల స్వాధీనం ఆపాలి


## తెలంగాణ గిరిజన సమాఖ్య మహాసభలో అంజయ్య నాయక్ డిమాండ్




**గండిపేట్ : ( క్రైమ్ మిర్రర్ ):** ఫార్మాసిటీ పేరుతో గతంలో గిరిజన భూములను స్వాధీనం చేసుకున్న ప్రభుత్వాల తరహాలోనే ప్రస్తుతం ఫ్యూచర్ సిటీ పేరుతో గిరిజన ఆవాసాలు, భూములను ఆక్రమించే ప్రయత్నాలు జరుగు తున్నాయని తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్య నాయక్ ఆరోపించారు. తెలంగాణ గిరిజన సమాఖ్య రంగారెడ్డి జిల్లా మూడవ మహాసభ రాజేంద్రనగర్‌లోని ఏఆర్ దేవరాజ్ భవన్‌లో సక్రు నాయక్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న అంజయ్య నాయక్ మాట్లాడుతూ, గిరిజనులు భూములను నమ్ముకొని జీవించే కుటుంబాలని, గతంలో ఫార్మాసిటీ పేరుతో భూములు కోల్పోయిన అనేక మంది గిరిజన రైతులు పట్టణాలకు వలస వెళ్లి కార్మికులుగా మారాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ప్రస్తుతం ఫ్యూచర్ సిటీ పేరుతో అదే పరిస్థితి పునరావృత మవుతోందని విమర్శించారు. గిరిజనుల హక్కులను కాలరాస్తూ భూముల నుంచి వారిని బలవంతంగా వెళ్లగొట్టడం ఆందోళనకరమని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన చేవెళ్ల డిక్లరేషన్ హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు, సంక్షేమ కార్పొరేషన్లను బలోపేతం చేయాలని కోరారు. రాజీవ్ యువ వికాసం పథకం కింద స్వీకరించిన దరఖాస్తులపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని, గిరిజనులకు రావాల్సిన సబ్సిడీ బకాయిలను వెంటనే విడుదల చేసి పారిశ్రామిక వేత్తలకు ప్రోత్సాహం అందించాలని అన్నారు. తండా గ్రామపంచాయతీలకు తగిన నిధులు కేటాయించి, వాటిని రెవెన్యూ పంచాయతీలుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. సభలో పాల్గొన్న సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏ. రవీంద్రాచారి మాట్లాడుతూ గిరిజనుల హక్కుల కోసం సమాఖ్య ఆధ్వర్యంలో ఉద్యమాలను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. గిరిజనుల నివాస సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకొని అర్హులందరికీ పక్కా ఇళ్లు నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు, మాజీ జిల్లా కార్యదర్శి పుస్తకాల నర్సింగరావు, మండల కార్యదర్శి కన్యగారి నర్సింహారెడ్డి, జిల్లా నాయకులు, గిరిజన సమాఖ్య ప్రతినిధులు, యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# శంషాబాద్‌లో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం -- పార్టీ బలోపేతానికి కేటీఆర్ పిలుపు

**గండిపేట్ : ( క్రైమ్ మిర్రర్ ):** శంషాబాద్‌లోని జేడీ కన్వెన్షన్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సభ్యత్వ నమోదు కార్యక్రమం, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) అంశాలపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం బస్తీబాట కార్యక్రమంలో భాగంగా హనుమాన్ నగర్ బస్తీలో పర్యటించిన కేటీఆర్, స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శీలం తిరుపతి రెడ్డి, ఎర్రోళ్ల యాదయ్య, ధనంజయ్ రెడ్డి, రావి, పాపిరెడ్డి, వెంకట్ రెడ్డి, మల్లారెడ్డి, వెంకటేష్, పట్లోళ్ల శ్రీధర్ రెడ్డి, చత్రిపల్లి సతీష్, ప్రవీణ్, నవీన్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# వాసవి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాల ప్రదానం



**గండిపేట్ : ( క్రైమ్ మిర్రర్ ):** నార్సింగి సర్కిల్ పరిధిలోని అల్కాపురి టౌన్‌షిప్ వాసవి వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో 10వ తరగతి మరియు ఇంటర్మీడియట్‌లో 90 శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించిన వాసవి విద్యార్థి, విద్యార్థినులకు ప్రతిభా పురస్కారాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు పొలం యాదగిరి మాట్లాడుతూ, విద్యార్థుల కృషిని గుర్తించి వారిని ప్రోత్సహించేందుకు ఈ పురస్కారాలను అందజేస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులోనూ విద్యార్థులు మరింత ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, సభ్యుల కుటుంబాలు, విద్యార్థులు పాల్గొని విజయవంతమైన విద్యార్థులను అభినందించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సన్మానాలు, ప్రశంసాపత్రాలు అందజేసి వారి విజయాలను కొనియాడారు.

# ఉప్పల్ బగాయత్ లో జరిగే భూ పోరాటాన్ని జయప్రదం చేయండి

**తెలంగాణ అమరవీరుల ఆశయాల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు కోరే సాయిరాం**



**క్రైమ్ మిర్రర్, కల్వకుర్తి:** జులై 2న హైదరాబాద్లోని ఉప్పల్ బాగాయత్ లో జరిగే భూ పోరాటాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర అమరవీరుల ఆశయాల సాధన సమితి అధ్యక్షులు కోరే సాయిరాం పిలుపునిచ్చారు. ఆదివారం కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ అతిథి గృహంలో ఆయన సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. తెలంగాణ ఉద్యమ కారులకు తెలంగాణలో దగాపడ్డ కళాకారులకు తెలంగాణ ఉద్యమాన్ని ప్రపంచానికి చూపించిన జర్నలిస్టు మిత్రులకు తెలంగాణ రాష్ట్రం కోసం ఆత్మ బలిదానం చేసుకున్న అమరవీరుల కుటుంబాలను ప్రభుత్వం గుర్తించి హైదరాబాద్ నడి బొడ్డున ఉప్పల్ బగాయత్ లో 250 చదరపు గజాల స్థలాన్ని తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన పేరుతో ఒక కమిటీ వేసి నిర్లక్ష్యం చేస్తుందని అన్నారు. తెలంగాణ ఉద్యమానికి ఎలాంటి సంబంధం లేని కేశవరావు ను ఆ కమిటీలో పెట్టడం సరైనది కాదని అన్నారు. జులై 2న జరిగే భూపోరాట కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కల్వకుంట్ల కవిత హాజరవుతున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని ప్రజా సంఘాల నాయకులు తెలంగాణ ఉద్యమ కారులు తెలంగాణ అమరవీరుల కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొని భూ పోరాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో తెలంగాణ అమరవీరుల ఆశయాల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు కోరే సాయిరాం, భూ పోరాట మహబూబ్ నగర్ ఉమ్మడి జిల్లా ఇన్చార్జి ఎదురుగట్ల సంపత్ గౌడ్, తెలంగాణ అమరవీరుల ఆశయాల సాధన సమితి రాష్ట్ర గౌరవ అధ్యక్షులు తెల్గమల్ల లింగయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లోజుల శ్రీనివాస చారి, రాష్ట్ర కోశాధికారి వేముగంటి సురేష్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి భట్టు లింగం, నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు గద్దం కిరణ్ కుమార్, జిల్లా నాయకులు బాస ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.